సాక్షి రంగారెడ్డి

గురువారం । 9 । అక్టోబర్ । 2025



పూల సాగు..

పూల సాగు రైతులకు ఆదాయం కురిపిస్తోంది. దీంతో ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. 10లో▸



రాజాసింగ్‌పై ఫిర్యాదు

మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. 10లో▸



మెప్మాకు అనుసంధానం

గ్రామాల్లో ఇన్నాళ్లుగా కొనసాగిన మహిళా సంఘాలు మెప్మా పరిధిలో పని చేస్తాయని పీడీ వెంకటనారాయణ తెలిపారు. 10లో▸

న్యూస్‌రీల్

డిజిటల్ యాప్‌పై రైతులకు శిక్షణ



రైతులతో శాస్త్రవేత్తలు

హయత్‌నగర్: వ్యవసాయ పరిశోధనల ఫలితాలను రైతులకు అందించాలని, వ్యవసాయ డిజిటల్ యాప్ వినియోగంపై వారికి అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉష సూచించారు. బుధవారం హయత్‌నగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయోసైన్స్ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయం, చీడపీడల యాజమాన్యంపై అన్నదాతలకు శిక్షణ ఇచ్చారు. పంటలను ఆశించే తెగుళ్లను సకాలంలో గుర్తించి, డిజిటల్ విధానంలో నివారణ చర్యలు తెలుసుకోవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఏబీఐ కో ఆర్డినేటర్లు చంద్రకాంత్, మధుమంజరి, శాస్త్రవేత్తలు అనీఫా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన భూ బాధితులు



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

షాబాద్: తాతముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములు రేడియల్ రోడ్డులో పోతున్నాయని నాన్‌ధార్‌ఖాన్‌పేట్, మాచన్‌పల్లి రైతులు వాపోయారు. ఈ మేరకు బుధవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వందల ఏళ్లుగా ఇదే భూముల్లో వ్యవసాయం చేసుకుని బతుకుతున్నామని, ఇది తప్ప తమకు మరో ఆధారం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన ఎంపీ రైతులకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి పొన్న రాజీవ్‌రెడ్డి, నాయకులు కృష్ణచారి, అశోక్, కూతురు మహేందర్, జగదీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పరిహారంతో పాటు ఇంటి స్థలం

టీజీఐఐసీ బాధితులకు కలెక్టర్ హామీ



కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసిన ఎల్మినేడు భూ నిర్వాసితులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడులో టీజీఐఐసీకి భూములు కోల్పోయిన రైతులకు పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలు ఇస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, టీజీఐఐసీ అధికారుల సమక్షంలో బుధవారం భూనిర్వాసితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను సేకరించారు. పరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వాలని బాధితులు కోరారు. పరిహారం తీసుకున్న వారి జాబితాలో కొంత మంది అనర్హులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్మినేడులో వెంచర్ ఏర్పాటు చేసి పరిహారంతో పాటు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ టీం సభ్యుడు శ్రావన్, ఎల్మినేడు భూ కమిటీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు



సంధ్యారాణి (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా గుడిపల్లికి చెందిన గజ్జల శ్రీకాంత్ రెడ్డి అతని భార్య సంధ్యారాణి(32) పిల్లలతో కలిసి జీవనోపాధి నిమిత్తం రెండు నెలల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి కర్రీ పాయింట్‌ను నడుపుతున్నారు. ఈ నెల 1న ఎల్లారెడ్డిగూడలోని సోదరుడి ఇంటికి వెళ్లిన సంధ్యారాణి 7న తుక్కుగూడ వచ్చానని చెప్పినప్పటికీ ఇంటికి చేరుకోలేదు. తిరిగి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆందోళనకు గురైన భర్త ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఇరకాటం!

పార్టీ మారిన ఎమ్మెల్యేకు వింత పరిస్థితి



- కండువా కప్పుకోలేరు.. ప్రచారానికి వెళ్లలేరు
- అనుచరులు, వారసుల గెలుపు కోసం పనిచేయలేని వైనం
- పదవిపై వేలాడుతున్న అనర్హత కత్తి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ఎన్నికలు క్లిష్టంగా మారాయి. పార్టీ మారామని చెప్పుకోలేని పరిస్థితి ఓవైపు.. కొత్త కండువా వేసుకుని తమ అనుచరులకు మద్దతుగా ప్రచారం చేయలేని పరిస్థితి మరోవైపు వీరిని ఇబ్బంది పెడుతోంది. పార్టీ ఫిరాయింపుల కేసు, స్పీకర్ విచారణ ఇరకాటంలోకి నెట్టాయి. సంస్థాగతంగా పట్టుకోసం తమ అనుచరులను జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా బరిలోకి దించేందుకు ఇప్పటికే అధిష్టానానికి పలు పేర్లను సిఫార్సు చేసినప్పటికీ.. అభ్యర్థుల గెలుపుకోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం లేకుండాపోయింది. బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచిన తర్వాత అధికార కాంగ్రెస్ గూటికి చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ వద్ద వీరిద్దరూ సీఎం సమక్షంలో కండువా కప్పుకొన్న ఫొటోలు మాత్రమే ఉన్నాయి. ఒకవేళ వీరు స్థానిక ఎన్నికల ప్రచారానికి వెళ్తే న్యాయస్థానంతో పాటు స్పీకర్‌కు నేరుగా సాక్ష్యం అందించిన వారవుతారనేది అక్షర సత్యం.

అభివృద్ధి కోసం అటుఇటు..!

చేవెళ్ల నియోజకవర్గంలో మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లితో పాటు వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని పలు గ్రామాలున్నాయి. జిల్లా పరిధిలో నాలుగు జెడ్పీటీసీ, 45 ఎంపీటీసీ, 109 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య రాజకీయ ప్రస్థానం తన సొంత మండలమైన నవాబుపేట నుంచి ప్రారంభమైంది. కాంగ్రెస్ నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీగా పనిచేశారు. అనంతరం 2014లో అదే పార్టీ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బీఫాంపై పోటీ చేసి రెండోసారి గెలుపొందారు. 2024లో కూడా అదే పార్టీ నుంచి పోటీ చేసి తిరిగి అధికార కాంగ్రెస్ గూటికి చేరారు. నియోజకవర్గ అభివృద్ధి పేరుతో కారు దిగి.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాల్సిందిగా ప్రతిపక్ష బీఆర్‌ఎస్ కోర్టును ఆశ్రయించడం, బంతి స్పీకర్ కోర్టులోకి నెట్టడం, విచారణకు హాజరు కావాల్సిందిగా కోరుతూ సదరు ఎమ్మెల్యేకు స్పీకర్ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. నెత్తిన అనర్హత కత్తి వేలాడుతున్న నేపథ్యంలోనే విడుదలైన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఆయన్ను ఇబ్బందుల్లో పడేసింది.

జెడ్పీ పీఠం కోసం..

ఈసారి జిల్లా పరిషత్ పీఠాన్ని ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడం తన నియోజకవర్గంలోని షాబాద్ ఎస్సీ మహిళకు, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలు ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో షాబాద్ లేదా చేవెళ్ల నుంచి తన కోడలిని నిలబెట్టి జెడ్పీ చైర్‌పర్సన్ సీటు దక్కించుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. కానీ కాంగ్రెస్ కండువా వేసుకుని నేరుగా ప్రచారం చేయలేని సంకటం ఎదురైంది.

ప్రకాశ్‌గౌడ్‌దీ ఇదే పరిస్థితి..

రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట మండలాల్లోని రాజేంద్రనగర్ మండలం పూర్తిగా జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వెళ్లింది. గండిపేటలో ఒక కార్పొరేషన్, రెండు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. ఇక్కడ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు లేవు. కేవలం శంషాబాద్ మండలంలోనే స్థానిక సంస్థలున్నాయి. ఇక్కడ 21 గ్రామ పంచాయతీలు, తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. రాజేంద్రనగర్ నుంచి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సైతం రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటి వరకు తనను నమ్ముకుని, వెంట వచ్చిన అనుచరులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. ఒకవేళ వీరికి అవకాశం వచ్చినా నేరుగా ప్రచారం చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు
- ఉర్దూ మీడియం స్కూల్‌లో తరగతి ప్రారంభం



మరమ్మతు పనులు పూర్తి చేసిన తరగతి గదిని ప్రారంభిస్తున్న డీఈఓ తదితరులు

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ తమ సహకారాన్ని అందించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు కోరారు. పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో రూ.6 లక్షలతో కేఎస్ఏ ఫౌండేషన్ చేపట్టిన పనులను బుధవారం నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పనకు మరిన్ని సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తన సొంత డబ్బులు వెచ్చించి టైల్స్, ఫెన్సింగ్, మోటార్ పైప్‌లైన్ తదితర పనులు చేయించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నౌషిన్ సుల్తానాను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఏ సంస్థ జనరల్ సెక్రెటరీ ఆస్మా నిక్కత్, తహసీల్దార్ సురేందర్, ఎంపీడీఓ వెంకయ్య, ఎంఈఓ అక్బర్, ఆదర్శ పాఠశాల, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు శోభారాణి, ఉదయశ్రీ, ఉపాధ్యాయుల తాహేర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఈ గుర్తులు దేనికి సంకేతం?



ముట్పూర్ శివారులో రోడ్డు పక్కన వేసిన గుర్తు

కొందుర్గు: అసలే ఓ వైపు రీజినల్ రింగ్ రోడ్డు, మరోవైపు రేడియల్ రోడ్డు వెళుతున్నాయనే ప్రచారంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఉన్న కొద్దిపాటి పొలం రోడ్డులో పోతే ఎలా బతకాలని మనోవేదనకు గురవుతున్నారు. ఈ సమయంలో మండలంలోని ముట్పూర్ శివారులో రామచంద్రాపూర్ నుంచి రేగడిచిల్కమర్రి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా దాదాపు 150 ఫీట్ల దూరంలో పసుపుపచ్చని రంగుతో రాతిబండలపై ఈపీఓ ఎ5 అని గుర్తులు పెట్టారు. ఇవి ఎవరు పెట్టారో.. ఎందుకు పెట్టారో తెలియక స్థానికులు అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా తమకు తెలియదని చెప్పడంతో గ్రామస్తులు టెన్షన్ పడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయండి

- జిల్లాలో 33 కేంద్రాలు ప్రారంభించాలి
- అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వరి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 33 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 ధర లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించనున్నట్లు వివరించారు. సన్నరకం, దొడ్డు రకం సెంటర్లను వేర్వేరుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సెంటర్లలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, కంట్రోల్ రూమ్ నంబర్లు ప్రదర్శించాలని, రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సివిల్ సప్లయ్ మేనేజర్ హరీశ్, డీసీఎస్ఓ వనజాత, డీఆర్‌డీఓ శ్రీలత, డీసీఓ సుధాకర్, డీఏఓ ఉష, డీఎంఓ రియాజ్, డీఎల్‌ఎంఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .


నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం!

- నేడే నోటిఫికేషన్
- 11 వరకు దరఖాస్తుల స్వీకరణ
- తొలి విడతలో 10 జెడ్పీటీసీ, 110 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధమైంది. జిల్లా ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆయా మండలాల వారీగా జిల్లాస్థాయి అధికారులను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించింది. గురువారం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లు చేసింది. తొలి విడతలో పార్టీ గుర్తులపై ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నిక షెడ్యూల్ సైతం విడుదల చేసింది. జిల్లాలోని 21 జెడ్పీటీసీ, 230 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేసింది. హైకోర్టు తాజాగా నోటిఫికేషన్ విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వెంటనే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో రిటర్నింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలి విడతలో చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు జెడ్పీటీసీ స్థానాలకు, కందుకూరు డివిజన్‌లోని ఐదు జెడ్పీటీసీ స్థానాలకు, రాజేంద్రనగర్ డివిజన్‌లోని ఒక జెడ్పీటీసీ స్థానానికి, ఆయా డివిజన్ల పరిధిలోని మొత్తం 110 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి ఈ నెల 11 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇక మిగిలిన 11 జెడ్పీటీసీ, 120 ఎంపీటీసీ స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 13న వెలువడనుంది. ఇదిలా ఉంటే తొలి విడత ఎన్నికలు నిర్వహించే ప్రాదేశిక స్థానాలకు నామినేషన్ వేయడానికి ఈ నెల 11న(శనివారం అశ్వీజ బహుళ పంచమి) మంచి ముహూర్తం ఉన్నట్లు వేద పండితులు చెప్పుతున్నారు. మెజార్టీ సభ్యులు అదే రోజు నామినేషన్లు వేసే అవకాశం ఉంది.

కాపురానికి రావడం లేదని..

రెండో భార్యను హత్య చేసిన భర్త



రజిత (ఫైల్)

చేవెళ్ల: కాపురానికి రావడం లేదనే కక్షతో భార్యను కడతేర్చాడో భర్త. మాట్లాడుకునేందుకు తీసుకెళ్లి బండ రాయితో మోది దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఆలూరు అనుబంధ గ్రామమైన వెంకన్నగూడకు చెందిన వానరాసి జంగయ్య బతుకుదెరువు నిమిత్తం రాంచంద్రాపురంలో ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలున్నారు. ప్రస్తుతం రాంచంద్రాపురంలో మొదటి భార్యతో కలిసి ఉంటున్నాడు. రెండో భార్య రజిత(30) పటాన్‌చెరులో ఇళ్లలో పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. గత రెండేళ్లుగా వీరి మధ్య మనస్పర్థలు నెలకొనడంతో రజిత దూరంగా ఉంటోంది. కాపురానికి రావాలని ఎన్నిసార్లు మాట్లాడటానికి ప్రయత్నించినా ఆమె నిరాకరించింది. ఎట్టకేలకు తన తల్లి వద్ద మాట్లాడుకుందామని చెప్పిన జంగయ్య ఆమెను తీసుకుని గత సోమవారం రాత్రి వెంకన్నగూడకు వచ్చాడు. మరుసటి రోజు మంగళవారం గ్రామస్తుల సమక్షంలో పంచాయితీ పెట్టినా భర్తతో ఉండేందుకు రజిత అంగీకరించలేదు. దీంతో కక్ష పెంచుకున్న జంగయ్య అదేరోజు రాత్రి రజితను గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లి చున్నీ మెడకు బిగించి, తలపై బండ రాయితో మోది చంపాడు. అనంతరం నేరుగా వెళ్లి పీఎస్‌లో లొంగిపోయాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా హత్యలో మొదటి భార్య ప్రమేయంపైనా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ప్రజలు కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు

- ఆరు గ్యారంటీల అమలుపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయం ఖాయం
- మార్నింగ్ వాక్‌లో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



యాచారంలో మహిళలకు కాంగ్రెస్ బాకీ కార్డులు అందజేస్తున్న కిషన్‌రెడ్డి

యాచారం: ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. యాచారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులు పంచారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా సకాలంలో నిర్వహించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ మోసాలు ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయని, అభివృద్ధి, సంక్షేమం కావాలంటే కేసీఆర్ రావాలనే ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మద్దతుదారులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రెండేళ్ల తర్వాత జరిగే సాధారణ ఎన్నికలకు ప్రస్తుత స్థానిక ఎన్నికలు ప్రీఫైనల్‌గా భావించాలన్నారు. అత్యధిక స్థానాల్లో విజయం సాధించి, ఎంపీపీ, జెడ్పీ పీఠాలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, యాచారం మాజీ సర్పంచ్ మారోజ్ కళమ్మ, నాయకులు యాదయ్యగౌడ్, జోగు అంజయ్య, చింతుల్ల సాయిలు, బూడిద రాంరెడ్డి పాల్గొన్నారు.

వెక్కిరించిన 'ఏకగ్రీవం'!

గ్రామాభివృద్ధిని కాంక్షించి పంచాయతీలను ఏకగ్రీవం చేసిన గ్రామాలకు మొండిచేయే దక్కింది. ఎన్నికలు లేకుండా ఆదర్శంగా నిలిచిన జీపీలు పాలకుల వ్యవహారంతో అన్యాయానికి గురయ్యాయి. రూ.10 లక్షలు వస్తే ఊరిని అభివృద్ధి చేసుకుందామనుకున్న వీరి ఆశలు అడియాశలయ్యాయి.

- యునానిమస్ పంచాయతీలకు మొండిచేయి
- పదవీ కాలం పూర్తయినా దక్కని నజరానా
- నిధుల విడుదలను పట్టించుకోని గత ప్రభుత్వం
- పాలకుల హామీలపై ప్రజల్లో సన్నగిల్లిన విశ్వాసం



గత ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కొందుర్గు మండలం లక్ష్మీదేవునిపల్లి పంచాయతీ

కొందుర్గు: పంచాయతీ ఎన్నికల వేళ ఆశావహుల మధ్య పోటాపోటీ సాగుతోంది. అప్పటివరకు మిత్రులుగా ఉన్న వారు రాజకీయ శత్రువులుగా, పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితిలో ఉన్న వారు దోస్త్‌మేరా దోస్త్ అనేలా సమీకరణాలు మారిపోతున్నాయి. సాధారణ రోజుల్లో అంతా కలివిడిగా ఉండేవారు వేర్వేరు వర్గాలుగా విడిపోతున్నారు. ఊరిలో పరువు కోసం గెలిచి తీరాల్సిందేననే పట్టుదలను ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చుకైనా వెనకడుగు వేసేది లేదని తెగేసి చెబుతున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు విందులు ఏర్పాటు చేసి మాటామంతీ నిర్వహిస్తున్నారు. ప్రజల్లో తమకున్న ఆదరణ, బలాన్ని ప్రదర్శించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎన్నికల వేళ గ్రామాల్లో రోజూ పండగ వాతావరణమే కనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు. ఆత్మీయ పలకరింపులు, వరుసలు కలుపుకొని కబుర్లు.. గెలుపోటములపై చర్చలూ ఇలా ఒక్కటేమిటి ఏ ఇద్దరు కలిసినా సర్పంచ్, వార్డు ఎన్నికల కోలాహలమే కనిపిస్తోంది. ఇంతటి సందడి ఉండే ఎన్నికలను ఏకగ్రీవం పేరుతో ఆదర్శంగా నిలిచిన గ్రామాలకు తగిన ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. గతంలో ఏకగ్రీవంగా ఎన్నికై న పంచాయతీలకు రూ.50 వేల పురస్కారం అందించేవారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈమొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచారు. యునానిమస్‌గా ఎన్నికైన అన్ని జీపీలకు నిధులు విడుదల చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, వసతులను కల్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల నజరానా ప్రకటించింది. కానీ నిధులు మాత్రం విడుదల చేయలేదు.

జిల్లాలో 43 పంచాయతీలు

2019 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 43 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఎన్నికలు జరగకుండా సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లందరినీ యునానిమస్‌గా ఎన్నుకుంటే తమ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు వస్తాయనే ఆశతో ప్రజలు ఈనిర్ణయం తీసుకున్నారు. కానీ మళ్లీ ఎన్నికలు వచ్చినా పురస్కారం డబ్బులు రాకపోవడంపై ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కాంగ్రెస్ ఏం ప్రకటిస్తుందో..?

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ఎలాంటి నజరానా ప్రకటిస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. కానీ గత ప్రభుత్వం మాట తప్పిన నేపథ్యంలో ప్రజలు నమ్ముతారా.. లేదా అనేది వేచి చూడాల్సిందే.

గ్రామాభివృద్ధికి ఉపయోగపడేవి..



ఏకగ్రీవంగా ఎన్నికై న పంచాయతీలకు రూ.10 లక్షలు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించడంతో మా గ్రామస్తులంతా ఏకమై వార్డు మెంబర్లతో పాటు సర్పంచ్‌గా నన్ను ఏకగ్రీవం చేశారు. మా పదవీ కాలం పూర్తయినా ఒక్కరూపాయి కూడా రాలేదు. ఆ డబ్బులు ఇస్తే గ్రామాభివృద్ధికి ఎంతో ఉపయోగపడేవి.

– నర్సింలు, మాజీ సర్పంచ్, లక్ష్మీదేవునిపల్లి, కొందుర్గు మండలం

పట్టించుకోలేదు



బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు. నిధుల లేమితో పల్లెల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం వారికే నష్టం. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఏకగ్రీవ పంచాయతీలను ప్రోత్సహించాలి. ముందస్తుగా ప్రోత్సాహక మొత్తాన్ని ప్రకటించి, ఎన్నికలు పూర్తయిన మూడు నెలల్లోపు నిధులు విడుదల చేయాలి.

– భూపాలచారి, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

గ్లెండేల్ అకాడమీ విద్యార్థులకు సీఎం అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బండ్లగూడ: సింగపూర్‌లో ఇటీవల జరిగిన గ్లోబల్ ఎక్సలెన్స్ డే(జీఈడీ) 2025లో మిడిల్ స్కూల్ విభాగంలో సన్‌సిటీలోని గ్లెండేల్ అకాడమీ విద్యార్థులు బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించి సన్మానించారు. గ్రీన్ గ్లెన్ గార్డియన్స్ బృందంలో ఆరాధ్య దుద్దిళ్ల శ్రీపాదరావు(6వ తరగతి), నిగమా పెమ్మెట్సా(6వ తరగతి), సయ్యద్ అలిజా జైఆమా(6వ తరగతి), రాహిని సమ్మిత వర్మ దంతులూరి(7వ తరగతి), జేడెన్ డి రోజారియో(7వ తరగతి) ఉన్నారు. ఈ బృందం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 11 పాఠశాలల నుంచి 200 మందికి పైగా విద్యార్థులతో పోటీపడ్డారు. ది గుడ్ ఫుడ్ మూవ్‌మెంట్ అనే తమ ప్రాజెక్టును కై జెన్ (నిరంతర అభివృద్ధి) అనే అంశం కింద ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వారు సేంద్రియ వ్యవసాయం, స్థిరమైన వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతను వివరించారు. రసాయనాలపై ఆధారపడిన వ్యవసాయం వల్ల కలిగే హానికర ప్రభావాలు, పర్యావరణపరమైన బాధ్యతాయుత పద్ధతుల అవసరం, పర్యావరణ అవగాహన పెంపు కోసం ప్రాక్టికల్ లెర్నింగ్ ప్రాముఖ్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... తమ ఆవిష్కరణాత్మక ఆలోచనలతో స్థిరమైన అభివృద్ధి పట్ల కట్టుబాటుతో తెలంగాణను ప్రపంచ వేదికపై నిలబెట్టిన ఈ విద్యార్థులు రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ మిను సలూజా పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు వంద దరఖాస్తులు

రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటు కోసం బుధవారం 100 దరఖాస్తులు అందాయని ఇన్‌స్పెక్టర్ దేవేందర్ రావు వెల్లడించారు. శంషాబాద్ స్టేషన్ పరిధిలో గతంలో 35 దుకాణాలకు టెండర్లు పిలవగా.. 4,225 దరఖాస్తులు అందాయన్నారు. ఇదే రాష్ట్రంలోనే అత్యధికంగా దరఖాస్తులు అందిన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌గా రికార్డు సృష్టించిందన్నారు. ప్రస్తుతం నిర్వహించనున్న మద్యం దుకాణాల టెండర్ల కోసం దరఖాస్తులను ప్రారంభించామన్నారు. బుధవారం సాయంత్రానికి 100 దరఖాస్తులు అందాయన్నారు. గతంలో కంటే ప్రస్తుతం ఐదు దుకాణాలను అధికంగా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

తల్లిని వేధిస్తున్నాడని యువకుడి దారుణ హత్య





హత్యకు గురైన యాసర్ నిందితుడు ఆయాన్

రాజేంద్రనగర్: తల్లిని వేధిస్తుండటమేగాక తరచూ గొడవ పడుతుండటంతో ఆమె కుమారుడు తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తిని కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న యాసిర్ (28) ఒక చానల్‌లో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మహిళ(40)తో సహజీవనం చేస్తున్నాడు. మహిళతో పాటు ఆమె నలుగురు సంతానాన్ని తన వద్దే ఉంచుకుని అందరూ కలిసి నివసిస్తున్నారు. గత కొన్నాళ్లుగా సదరు మహిళతో యాసిర్ తరుచూ ఘర్షణ పడుతున్నాడు. బుధవారం ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో ఇంట్లో ఉన్న సదరు మహిళ పెద్ద కుమారుడు ఆయాన్ (18) ఆగ్రహం పట్టలేక కత్తితో యాసిర్‌పై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. దీనిని గుర్తించిన స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

పూల సాగు.. లాభాలు బాగు

- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి
- ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి



కాశీంబౌలిలో బంతి పూల సాగు

మొయినాబాద్‌రూరల్: పుష్పాల సాగు రైతులకు ఆదాయ పరిమళం కురిపిస్తోంది. గతంలో సంప్రదాయ పంటలు సాగు చేసి ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలను చవిచూసిన రైతులు ప్రస్తుతం తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను ఆర్జించేందుకు శ్రీకారం చుడుతున్నారు. ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పూల తోటల సాగుతో అధిక దిగుబడులు సాగించవచ్చని నిరూపిస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 1,200 ఎకరాలలో పూల సాగు చేస్తున్నారు. అందులో మొయినాబాద్ మండలంలోనే 300 ఎకరాల్లో పండిస్తున్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్, కాశీంబౌలి, బాకారం, వెంకటాపూర్, చిన్నమంగళారం, రెడ్డిపల్లి, కుతుబుద్దీన్‌గూడ, వీరన్నపేట్, చందానగర్, మోత్కుపల్లి, కనకమామిడి, కంచమోనిగూడ, శ్రీరామ్‌నగర్, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి ఆయా గ్రామాల్లో ఎక్కువగా గులాబీతో పాటు చామంతి, బంతి పూల తోటలు సాగు చేస్తున్నారు. చేవెళ్ల మండలంలోని కందవాడ, పల్గుట్ట, గుండాల, చందన్‌వెల్లి, దేవరంపల్లి గ్రామాల్లో రైతులు సైతం పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

మార్కెట్‌లో డిమాండ్

రైతులు పండిస్తున్న బంతి, చామంతి పూలకు శుభకార్యాలు ప్రారంభం కావడంతో పాటు సమీపిస్తున్న దీపావళి పండుగతో గిరాకీ వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బంతి కిలో రూ.50–60, చామంతి రూ.80–100 ధర పలుకుతుందని చెబుతున్నారు.

రూ.40 వేలు లాభం



ఏటా చామంతి సాగు చేస్తున్నాను. దసరా, దీపావళితో పాటు పెళ్లిళ్ల సీజన్ ఉండడంతో గిరాకీ ఉంది. ఒక ఎకరాకు రూ.60 వేల నుంచి 70 వేల వరకు ఖర్చు అవుతుంది. పెట్టుబడి పోగా దాదాపు రూ.40 వేల వరకు లాభాలు వస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పంట కొంత దెబ్బతింది.

– భూపాల్‌రెడ్డి, రైతు

ప్రభుత్వం సహకరించాలి



పూల సాగుకు పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నారు ఉచితంగా పంపిణీ చేయాలి. మొక్కలపై సబ్సిడీ ఉండేలా అధికారులకు చర్యలు తీసుకుంటే రైతులకు మేలు చేకూరుతుంది. పూల రైతుల పట్ల సర్కారు అవగాహన కల్పిస్తూ ఆదుకోవాలి.

– సైపాల్‌రెడ్డి, అమ్డాపూర్, రైతు

సబ్సిడీ లేదు

మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలలో అధికంగా పూల సాగు చేస్తారు. భారీ వర్షాలు కురవడంతో ఈ ఏడాది దిగుబడి తగ్గింది. రైతులు సబ్సిడీ నారు కోసం ఆరా తీస్తున్నారు. కానీ పూల సాగుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేదు. కూరగాయాల సాగుకు సబ్సిడీ ఉంది.

– కీర్తి, ఉద్యానవన శాఖ, చేవెళ్ల



నకిలీ గేమింగ్ యాప్‌తో మోసం

ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ గేమింగ్ ఫ్లాట్‌ఫామ్‌లతో అమాయకులను మోసం చేస్తున్న ఐదుగురు సైబర్ నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) డీసీపీ శోభన్ కుమార్‌తో కలిసి సైబర్ క్రైమ్ డీసీపీ సాయి శ్రీ బుధవారం వివరాలు వెల్లడించారు. నవీన్‌కుమార్, సందీప్ కుమార్, పృథ్వీ రామరాజు, పవన్ వెంకట నాగభరద్వాజ్, రామాంజనేయులు ముఠాగా ఏర్పడి టెలిగ్రాం, వాట్సాప్ గ్రూప్‌లలో డాడ్జ్ బుక్777 అనే నకిలీ గేమింగ్ ఫ్లాట్‌ఫామ్‌ను ఫ్లాట్‌ఫామ్‌లను నిర్వహించేవారు. బాధితులను నుంచే కాజేసే సొమ్మును నిర్వహించేందుకు అవసరమైన బ్యాంక్ ఖాతాల కోసం ఈ ముఠా నకిలీ పేర్లు, చిరునామా, ఆధార్ కార్డులతో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లలో 120కు పైగా బ్యాంక్ అకౌంట్లను తెరిచారు. గేమింగ్ ఫ్లాట్‌ఫామ్‌లలో నకిలీ లాభాలను చూపించి, బాధితుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్మును వసూలు చేసేవారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంక్ లావాదేవీల ఆధారంగా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వివిధ ఖాతాలలో ఉన్న రూ.14 లక్షల సొమ్ముతో పాటు రెండు ల్యాప్‌టాప్‌లు, 30 సెల్‌ఫోన్లు, చెక్ బుక్స్, ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మహిళా సంఘాలు మెప్మాకు అనుసంధానం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

చేవెళ్ల: గ్రామాల్లో ఇన్నాళ్లుగా కొనసాగిన మహిళా సంఘాలు అన్ని మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా పరిధిలో పని చేస్తాయని జిల్లా పీడీ వెంకట నారాయణ తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశం ఆధ్వర్యంలో బుధవారం మహిళా సంఘాల గ్రూప్ రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ వెంకటనారాయణ, డీఎంసీ(డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్) ఇందిరా మాట్లాడుతూ.. మహిళా సంఘాలు అన్ని మున్సిపాలిటీ పరిధిలో ఉండే మెప్మా సంస్థ పరిధిలోకి వస్తాయని చెప్పారు. చేవెళ్ల మున్సిపాలిటీగా ఇటీవలే ఏర్పడటంతో మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాలు అన్ని మెప్మాకు అనుసంధానం అయినట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, ఉపాధి శిక్షణ, ఆరోగ్య కార్యక్రమాలు, సంయుక్త నిధులు తదితర కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు మున్సిపాలిటీలలో మెప్మా సభ్యులకు అందుతాయని వివరించారు. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల గ్రూప్ రిసోర్స్ పర్సన్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు



సీఐ రాఘవేందర్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న సయ్యద్ ఖాజా పాషా

పహాడీషరీఫ్: ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖాజా పాషా కోరారు. ఈ మేరకు బుధవారం పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కలిసి మెలసి ఉంటున్న ప్రజల నడుమ మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు రాజాసింగ్ యత్నిస్తున్నారన్నారు. ఇప్పటికీ ఎన్నో మార్లు ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు అబ్దుల్ ఖదీర్, మహ్మద్ ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

తుపాకీ విక్రయానికి పండ్ల వ్యాపారుల యత్నం

పట్టుకున్న సీసీఎస్ స్పెషల్ క్రైమ్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: ఝార్ఖండ్ నుంచి వలస వచ్చి నగరంలో పండ్ల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి తేలిగ్గా డబ్బు సంపాదించడానికి తుపాకీ విక్రయానికి యత్నించాడు. ఈ విషయంపై సమాచారం అందుకున్న సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ అతడితో పాటు మరొకరిని పట్టుకున్నట్లు అదనపు సీపీ (నేరాలు) ఎం.శ్రీనివాసులు బుధవారం వెల్లడించారు. ఝార్ఖండ్‌కు చెందిన విజయ్ యాదవ్ నగరానికి వలసవచ్చి లింగంపల్లిలో నివసిస్తున్నాడు. వివిధ బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపుల వద్ద పండ్లు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించాలని భావించిన ఇతగాడు నాటు తుపాకుల్ని తీసుకువచ్చి విక్రయించాలని భావించాడు. మూడు నెలల క్రితం బీహార్ వెళ్లి అక్కడి సోను కుమార్ నుంచి రూ.58 వేలకు 0.7 ఎంఎం క్యాలిబర్ నాటు పిస్టల్ ఖరీదు చేసుకువచ్చాడు. దీన్ని నగరంలోని అసాంఘిక శక్తులకు అమ్మడానికి సహకరించాల్సిందిగా సంతోష్‌నగర్‌లో ఉంటున్న తోటి పండ్ల వ్యాపారి బంటి కుమార్ యాదవ్‌ను కోరారు. ఆ పిస్టల్ వీడియో తీసి ఇతడికి షేర్ చేసిన విజయ్ దాన్ని చూపిస్తూ ఎవరికైనా విక్రయించడానికి ప్రయత్నించాలని సూచించాడు. కొన్ని రోజులుగా ఇతగాడు ఆ అక్రమ ఆయుధం వీడియోను పలువురు రౌడీషీటర్లతో పాటు అసాంఘికశక్తులకు చూపిస్తూ అమ్మడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. దీనిపై సీసీఎస్ అధీనంలోని స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్‌కు సమాచారం అందింది. ఏసీపీ జి.వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బి.బిక్షపతి నేతృత్వంలోని బృందం ఫలక్‌నుమా ప్రాంతంలో వలపన్ని బంటి కుమార్‌ను పట్టుకుంది. అతడిచ్చిన సమాచారంతో విజయ్‌ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి తుపాకీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఫలక్‌నుమా పోలీసులకు అప్పగించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

37 మంది బైండోవర్

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న 37 మందిని బుధవారం యాచారం తహసీల్దార్ అయ్యప్ప ముందు బైండోవర్ చేసినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. మాల్–8, తక్కళ్లపల్లి–6, చింతుల్ల–8, కొత్తపల్లి–8, నందివనపర్తి–5, గునుగల్–2 మందిని బైండోవర్ చేసినట్లు ఆయన చెప్పారు. ఇంకా 18 గ్రామాల్లో ఉన్న బెల్టు దుకాణాల నిర్వాహకులను కూడా బైండోవర్ చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఏ గ్రామంలో మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

బ్యాంకు మాజీ ఉద్యోగికి టోకరా

రూ.12.99 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) పేరుతో ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్ పంపిన సైబర్ నేరగాళ్లు బ్యాంకు మాజీ ఉద్యోగిని మోసం చేశారు. ఆయన ఫోన్ ద్వారా బ్యాంకు ఖాతాను యాక్సస్ చేసి రూ.12.99 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బర్కత్‌పురకు చెందిన బాధితుడు ఈ నెల 4న ఫేస్‌బుక్‌లో ఓ ప్రకటన చూశాడు. పీఎస్‌బీ లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లోనూ అప్‌లోడ్ చేసే సౌకర్యం ఉందనేది దాని సారాంశం. దీనికి ఆకర్షితుడైన బాధితుడు తన సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసేందుకు ఆ లింక్‌ను క్లిక్ చేశాడు. దీంతో పీఎన్‌బీ లోగోను డీపీగా వినియోగించిన వాట్సాప్ నంబర్‌తో సైబర్ నేరగాడు బాధితుడితో మాట్లాడాడు. తనను సదరు బ్యాంకు ప్రతినిధిగా పరిచయం చేసుకుని, తాను పంపే లింక్ ద్వారా సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలని చెప్పాడు. అంగీకరించిన బాధితుడు తనకు వాట్సాప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేయడంతోనే దాని మాటున ఉన్న ఏపీకే ఫైల్ ఆయన ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయింది. దీని ద్వారా ఫోన్, అందులోని నెట్‌బ్యాంకింగ్, యూపీఐ ఖాతాలను సైబర్ నేరగాళ్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇలా వివిధ దఫాలుగా ఆయన పీఎన్‌బీ ఖాతాలో ఉన్న రూ.12,99,300 కాజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

'పోస్ట్' చేసే ముందు ఒక్క క్షణం!

డిజిటల్ అవేర్‌నెస్ చేపడుతున్న కొత్త కొత్వాల్

- మనోభావాలను దెబ్బతీయొద్దని హితవు
- తప్పుడు సమాచార ప్రచారం వద్దని హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనర్ తన 'ఎక్స్' ఖాతా వేదికగా డిజిటల్ అవేర్‌నెస్‌కు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి హ్యాష్‌ట్యాగ్ పాస్ బిఫోర్ పోస్టు (పోస్టు చేసే ముందు ఒక్కక్షణం) అంటూ ప్రచారం చేస్తున్నారు. దీనికి సంబంధించి ఆయన బుధవారం కీలక సందేశాన్ని పోస్టు చేశారు. సోషల్‌మీడియా ప్రతి ఒక్కరినీ శక్తిమంతుల్ని చేసిందని, సమాచారాన్ని పంచుకోవడానికి, ఎదుటి వారిని ప్రేరేపించడానికి, ప్రభావితం చేయడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏదైనా ఓ విషయాన్ని లేదా సమాచారాన్ని సెండ్ (పంపడం)... షేర్ చేయడానికి ముందు ఒక్క క్షణం ఆగి మూడు విషయాలను ఆలోచించాలని సజ్జనర్ స్పష్టం చేశారు. ఈ పోస్టు ఎవరినైనా బాధపెడుతుందా..? ఇందులోని సమాచారం నిజమైనదేనా? సోషల్‌మీడియాలో ఓ వ్యక్తిని ఉద్దేశించి పెట్టే సమాచారం ఆయన ఎదురుగానూ వ్యాఖ్యానించగలవా? అనేవి సరి చూసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించారు. నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా షేర్ చేసిన కొన్ని అంశాలు ఎదుటి వారి కీర్తి ప్రతిష్టలు, వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తాయనే విషయం మరిచిపోవద్దని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ రెస్పాన్సిబుల్‌గా ఉండాలని, ఏదైనా షేర్ చేసేముందు కచ్చితంగా ఆలోచించాలని సజ్జనర్ స్పష్టం చేశారు.

వారంలో 85 లక్షల వ్యూస్..

సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండే సజ్జనర్ తన ఖాతాలను తానే స్వయంగా పర్యవేక్షిస్తుంటారు. యువతకు సైతం దగ్గర కావాలనే ఉద్దేశంతో 'ఎక్స్'తో పాటు ఇన్‌స్టాగ్రాంలోనూ తనదైన పాత్రను పోషిస్తున్నారు. గతంలో హ్యాష్‌ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్ పేరుతో ఓ ఉద్యమాన్నే నడిపి ప్రత్యేక చట్టం కావడానికి తన వంతు కృషి చేశారు. యువతను ఈయన సొంత ఇన్‌స్టాగ్రాం ఖాతాను గడిచిన వారం రోజుల్లో 85 లక్షల మంది వీక్షించారు. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఫొటోకు ఇన్‌స్టాగ్రాంలో 12 లక్షలు, 'ఎక్స్'లో 2 లక్షల వ్యూస్ వచ్చాయి. సజ్జనర్ 'ఎక్స్' ఖాతాకు వారం రోజుల్లో 15 లక్షల మంది రియాక్ట్ అయ్యారు. సోషల్‌మీడియా ద్వారా తన దృష్టికి వచ్చే ప్రతి అంశాన్ని నగర పోలీసు అధికారిక హ్యాండిల్స్‌కు ట్యాగ్ చేస్తున్న ఆయన ఆద్యంతం పర్యవేక్షిస్తున్నారు. చార్మినార్ వద్ద ఓ విదేశీ మహిళను వేధించిన వీడియో ఇటీవల వైరల్‌గా మారింది. దీన్ని క్షేత్రస్థాయి అధికారులకు పంపిన సజ్జనర్ పూర్తి స్థాయి విచారణ చేయించి మూడేళ్ల క్రితం నాటిదిగా నిర్ధారించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొగల్స్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలివీ... బిహార్‌కు చెందిన మహ్మద్ హర్షద్ బతుకుదెరువు కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి మొగల్స్ కాలనీకి వచ్చి జీవనం సాగిస్తున్నారు. వీరు రేకుల ఇంట్లో ఉంటున్నారు. ఎడతెరపిలేని వర్షాల నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లోకి వర్షపు నీరు వస్తున్నాయని వారి కుటుంబారు తాపిక్(15) బ్యానర్‌ను తీసి ఇంటి రేకులపై కప్పేందుకు యత్నించాడు. ఈ సమయంలో బ్యానర్‌కు ఉన్న ఇనుప రాడ్‌కు కరెంటు ఉండటంతో విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ చార్జీలను తగ్గించాలి

రాజేంద్రనగర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను పెంచి మెరుగైన సేవలందించాల్సిన సమయంలో చార్జీలు పెంచడం ఏమిటని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వేముల మల్లేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నదనే సాకుతో రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. శివరాంపల్లిలోని తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల సమయంలో ఉచిత ఆర్టీసీ ప్రయాణ హామీని మహిళలకు ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీని ఒక పక్క నేరవేర్చుతూనే మరో పక్క రూట్ సర్వీసులను రద్దు చేసిందన్నారు. దీంతో నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.